క్లుప్తంగా

నేడు టీటీడీ కల్యాణ మండపానికి భూమిపూజ

సత్యవేడు: పంచాయతీలోని సంత స్థలంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం టీటీడీ కల్యాణ మండపం నిర్మాణానికి భూమిపూజ చేయనున్నారు. ఇందుకు సంబంధించి మంగళవారం టీటీడీ అధికారి ఆ స్థలాన్ని పరిశీలించి, కొలతలు తీశారు. గత ప్రభుత్వంలో కల్యాణ మండపానికి సర్వే నంబరు 352–4లో 52 సెంట్లు, 05లో 37 సెంట్లు, 6లో 31సెంట్లు భూమిని రెవెన్యూ అధికారులు ప్రతిపాదించగా అప్పటి కలెక్టర్ ఆమోదించారు. టీడీడీ ఈటకు 1.20 సెంట్లు భూమిని కల్యాణమండపానికి కేటాయించారు.

వేదిక ఏర్పాటు చేయాలి

శ్రీకాళహస్తి: ప్రతి కల్యాణమండపంలో వాయిద్య కళాకారులకు వేదిక ఏర్పాటు చేయాలని శ్రీకాళహస్తి నాయీ బ్రాహ్మణ వాయిద్య కళాకారులు సేవా సంఘం అధ్యక్షుడు మహేంద్ర కోరారు. పట్టణంలోని పొన్నాలమ్మ ఆలయం వద్ద మంగళవారం వారు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వివా హ వేడుకలకు మంగళవాయిద్యాలు తప్పనిస రి అన్నారు. కొన్ని కల్యాణ మండపాల్లో వాటి కోసం వేదికలు ఏర్పాటు చేస్తే మరికొన్ని వేదికల్లో కనీసం కింద కూర్చోవడానికి కూడా వస్త్రం కూడా ఇవ్వడం లేదని వాపోయారు. ప్రతి కల్యాణ మండపాల నిర్వాహకులు నాయీ బ్రాహ్మణులను దృష్టిలో ఉంచుకుని మంగళ వాయిద్యాలకు వేదికలు ఏర్పాటు చేయాలని కోరారు.

ముక్కంటి సేవలో ఆర్‌ఎస్‌ఎస్ నేత


ఆలయ ధ్వజస్తంభం వద్ద మురళీధర్

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామివారిని మంగళవారం ఆర్ఎస్ఎస్ నేత మురళీధర్ దర్శించుకున్నారు. ఆలయాధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధిలో వేదపండితులు ఆయన్ని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు చంద్రప్ప పాల్గొన్నారు.

సభ్యత్వాల నమోదుతో పార్టీ బలోపేతం

సత్యవేడు: అత్యధిక సభ్యత్వ నమోదుతో బీజేపీ బలోపేతం అవుతుందని ఆ పార్టీ మండల పార్టీ అధ్యక్షుడు మునిప్రతాప్ అన్నారు. మంగళవారం సాయంత్ర మండల పార్టీ సమావేశం నిర్వహించారు ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి మురళి, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి వాసు, సీనియర్ నాయకులు మోహన్‌బాబు, ఓబీసీ మోర్చా నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటేశులు, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.


గ్రాప్లింగ్ రెజ్లింగ్‌లో ఏర్పేడు విద్యార్థుల ప్రతిభ


విజేతలతో హెచ్‌ఎం ఆనంద్, ఉపాధ్యాయులు

ఏర్పేడు: మండలంలోని పల్లం హైస్కూల్ విద్యార్థులు గ్రాప్లింగ్ రెజ్లింగ్ పోటీల్లో ప్రతిభ చూపినట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం ఆనంద్ మంగళవారం తెలిపారు. రేణిగుంట బాలికల హైస్కూల్‌లో ఈ నెల 25, 26న రాష్ట్రస్థాయి గ్రాప్లింగ్ రెజ్లింగ్ పోటీలు జరిగాయన్నారు. పోటీల్లో పాఠశాలకు చెందిన విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు చెప్పారు. వివిధ కేటగిరీల్లో 7 బంగారు, 10 రజత, 8 కాంస్య పతకాలు సాధించి తిరుపతి జిల్లాకు చాంపియన్ షిప్ రావడానికి కారణమైనట్లు వెల్లడించారు. వీరు అక్టోబరు మొదటి వారంలో హర్యానా రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు హెచ్‌ఎం చెప్పారు.

అనారోగ్యంతో వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి

–సంతాపం తెలిపిన మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి


వెంకటరమణ (ఫైల్)

శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని బీవీ పురానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు.. శ్రీకాళహస్తి మండలం బీవీ పురం (గొల్లపల్లె)కి చెందిన ఉడమలపాటి వెంకటరమణ (35) వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా కొనసాగుతున్నాడు. ఇతను కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నా డు. మంగళవారం తన ఇంటి వద్ద మృతి చెందాడు. వెంకటరమణ మృతికి స్థానిక మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సంతాపం తెలిపి కుటుంబ సభ్యులకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. బుధవారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

మానవ సమాజానికి మచ్చ



కోల్‌కతాలో పీజీ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఉదంతం మానవ సమాజానికి మచ్చలాంటిది. ఈ ఘటన తర్వాత వైద్యుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. ఆస్పత్రుల్లో మహిళా వైద్యులు, సిబ్బంది నిర్భయంగా విధులు నిర్వర్తించేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. 24 గంటలు పనిచేసే పీహెచ్‌సీల్లో రాత్రి వేళ స్టాఫ్ నర్సు ఒక్కరే విధులు నిర్వర్తిస్తుంటారు. అలాంటి పరిస్థితుల్లో ఏమైనా జరిగే అవకాశం ఉంది. కాబట్టి ఆస్పత్రులకు పోలీసు భద్రతా కల్పించాలి.

– డాక్టర్ ఉదయ్ కుమార్, ప్రధాన వైద్యాధికారి, పీహెచ్‌సీ, వరదయ్యపాళెం



చట్టాలను కఠినతరం చేయాలి



కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం చేసి హత్య చేయడం ఆందోళన కలిగిస్తోంది. మహిళల భద్రతకు పెను ముప్పుగా కనిపిస్తోంది. వైద్యులు, వైద్య సిబ్బంది రక్షణకు కఠినతరమైన చట్టాలను తీసుకురావాలి. పీహెచ్‌సీలో వైద్యం కోసం వచ్చే రోగులు, వారి బంధువుల నుంచి మేము కూడా తరచూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఇలాంటి వారిని కఠినంగా శిక్షించాలి.

– డాక్టర్ గిరిజా ప్రకాశం, వైద్యాధికారి, పీహెచ్‌సీ, ఏర్పేడు

పదునెక్కిన అరక.. పెట్టుబడే మెలిక..!

- రైతులకు అందని పెట్టుబడి సాయం
- ఏటా రూ. 20వేలు అందిస్తామన్న బాబు
- ఇప్పటికీ ప్రకటన చేయలేదు
- చంద్రబాబు మళ్లీ మభ్యపెట్టారు
- ఖరీఫ్‌లో పంట సాగుకు తప్పని అప్పులు

వర్షం పుడమికి ఊరటనిచ్చింది.. భూమిని నమ్ముకున్న అన్నదాతకు ఊపిరి పోసింది. నేల గతిని మార్చి రైతుకు భరోసానిచ్చింది. దీంతో పుడమి పుత్రులు హలం పట్టి ఏరువాక సాగారు. దుక్కి దున్నారు..నారు పోశారు.. పెట్టుబడి లేక.. సాయం అందక.. చంద్రన్న సర్కారు హామీ నెరవేరక.. కాణీ లేని సాగు ఎలా చేయాలో దిక్కుతోచక..బ్యాంకులు, వడ్డీ వ్యాపారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇదీ నేడు కర్షకుల దుస్థితి.


పొలంలో చెక్క తోలుతున్న రైతు

సత్యవేడు: మండలంలో ఇటీవల తరచూ వర్షాలు కురవడంతో కర్షకులు హలాలు పట్టి, పొలాలు దున్నుతున్నారు. వరిసాగుకు సిద్ధమవుతున్నారు. అయితే అన్నదాతల ఆశల సాగుకు పెట్టుబడే సమస్యగా మారింది. పెరిగిన ఎరువులు, క్రిమిసంహారక మందుల ధరలకు తోడు పెరిగిన కూలీలు ఖర్చు, ట్రాక్టర్ అద్దెలతో సాగుకు పెట్టుబడి తడిసి మోపెడవుతోంది. దీనికితోడు పెట్టుబడి సాయం అందకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఎకరా వరి సాగుకు నారు పెంపకం మొదలు కోతల వరకు మొత్తంగా రూ.30 వేలకు పైగానే వ్యయం చేయాల్సి వస్తోందని అన్నదాతలు చెబుతున్నారు.

సాగుకు అందని సాయం

సత్యవేడులో మండలంలోని రైతులు 12 వేల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తారు. ఖరీఫ్ సీజన్ జూన్ నెలతో ప్రారంభమైనప్పటికీ ఇప్పటివరకు అన్నదాతకు పెట్టుబడి సాయం అందలేదు. ఎన్నికల సమయంలో చంద్రబాబు తాను అధికారంలోకి వస్తే రైతులకు సీజన్‌కు ముందే ఏటా ఒక్కొక్క కర్షకుడికి రూ.20 పెట్టుబడి సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. అయితే సీజన్ మొదలై రెండు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు ఆ హామీ అమలుకు నోచుకోలేదు. పీఎం కిసాన్ యోజన కింద కేంద్రం నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసినా టీడీపీ ప్రభుత్వం మాత్రం ఇప్పటికి సాయం జమ చేయలేదు. రైతు భరోసా పథకం పేరును అన్నదాత సుఖీభవ అని మార్చడం తప్ప చేసిందేమి లేదని రైతులు అంటున్నారు.

తప్పని అప్పుల తిప్పలు

రైతులకు చంద్రబాబు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో పెట్టుబడి కోసం అప్పులు చేయక తప్పడం లేదు. దీంతో కొందరు బ్యాంకులను ఆశ్రయించగా, మరికొందరు బయట ప్రైవేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. అవి కూడా దొరక్క తిప్పలు పడుతున్నారు. సాగు ఎలా చేయాలో దిక్కుతోచక ఆందోళన చెందుతున్నారు.

గతంలో సీజన్ ముందే సాయం

గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వ్యవసాయం రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చింది. రైతు భరోసా పథకాన్ని పకడ్బందీగా అమలు చేసింది. పెట్టుబడి ఖర్చులకు అన్నదాతలు ఏ మాత్రం ఇబ్బంది పడకూడదని చిత్తశుద్ధితో సాయం అందించింది. పీఎం కిసాన్ కింద రూ.6 వేలు, వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.7500 కలిపి ఏడాదికి రూ.13,500 మూడు విడతలుగా సీజన్ ఆరంభంలోనే రైతుల బ్యాంకు ఖాతాల్లో జగనన్న ప్రభుత్వం జమ చేసిందని రైతులు గుర్తు చేసుకుంటున్నారు. చంద్రబాబు సీఎం అయ్యాక రైతులను మభ్యపెడుతున్నారంటూ మండి పడుతున్నారు.


వరిసాగుకు ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతు


సిద్ధం చేసిన నారుమడి

పెట్టుబడ్డి సాయం అందించాలి



గత ప్రభుత్వంలో ఖరీఫ్ ప్రారంభంలోనే పెట్టుబడి సాయం అందించారు. పంట పెట్టుబడికి డబ్బులు ఉపయోగపడేది. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ జరుగుతున్నా ఇంతవరకు ప్రభుత్వం పెట్టుబడి సాయం ప్రకటించలేదు. సాగు సమయంలో పెట్టుబడికి సాయం అందిస్తే మేలు.

– ఈ. గోవిందస్వామి, సత్యవేడు

ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతులకు ఇస్తామన్న పెట్టుబడి సాయం రూ. 20 వేలు ఇచ్చి, మాట నిలబెట్టుకోవాలి. పంట పనులు ప్రారంభంలోనే పెట్టుబడి సాయం అందిస్తే రైతుకు అప్పు చేయాల్సిన పని ఉండదు. ప్రభుత్వ ఏర్పడి 100 రోజులు అవుతున్నా ఎప్పుడిస్తారో కూడా తెలియడంలేదు. త్వరితగతిన సాయం అందించాలి.

–వై.గోపాల్ రెడ్డి, సత్యవేడు

ఇబ్బంది లేకుండా చూడాలి



పంటల సాగుకు ఖర్చులు బాగా పెరిగాయి. సాగుకు ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించాలి. గత ప్రభుత్వం సీజన్‌కు ముందే పెట్టుబడి సాయం అందించింది. ఉచిత పంటల బీమాను అమలు చేసింది. వ్యవసాయ పనులు చేసేందుకు ఇబ్బంది లేకుండా ఉండేది. టీడీపీ ప్రభుత్వం ఇప్పటికైనా పెట్టుబడి సాయం అందించేందుకు చొరవ చూపాలి.

– డి.ధర్మారెడ్డి సత్యవేడు

తెగిన బొటనవేలును అతికించారు!


మాట్లాడుతున్న డాక్టర్ వాసుదేవరెడ్డి

రేణిగుంట: మండలంలోని అమర ఆస్పత్రిలో వేరుపడిన బొటనవేలును అతికించేందుకు మైక్రోస్కోపీ సాయంతో చేసిన అరుదైన శస్త్ర చికిత్స విజయవంతమైందని అమర ఆస్పత్రి వైద్య నిపుణుడు డాక్టర్ వాసుదేవరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన అమర ఆస్పత్రిలో మీడియాతో మాట్లాడుతూ మదనపల్లెకు చెందిన చిన్న రెడ్డెప్ప(60) పసుపు తయారీ మిషన్‌లో ప్రమాదవశాత్తు చేయి పడి కుడిచేతి బొటనవేలు తెగిపడిందన్నారు. వారు హుటాహుటిన అమర ఆస్పత్రికి బొటన వేలును ఐస్ ప్యాక్‌లో ఉంచి తీసుకొచ్చారన్నారు. తాము అత్యంత క్లిష్టమైన బొటనవేలును అతికించడానికి మైక్రోస్కోపీ ద్వారా శస్త్ర చికిత్స చేసి, రక్తనాళాలు, కండరాలను అతికించి బొటనవేలును యథావిధంగా పని చేసేలా చేసినట్లు తెలిపారు. రెండు వారాల పాటు హాస్పిటల్‌లో చికిత్స తీసుకుని డిశ్చార్జ్ చేశామన్నారు. బాధితుడు చిన్నరెడ్డెప్ప అమర ఆస్పత్రి యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమర ఆస్పత్రి సీఏఓ వేణుగోపాల్, మార్కెటింగ్ మేనేజర్ నరసింహారావు, పీఆర్వో మునినాదం పాల్గొన్నారు.

విద్యా పరికరాల పంపిణీ

సత్యవేడు: తొండుకుల్లి ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 17మంది విద్యార్థులకు సత్యవేడు ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నోటుపుస్తకాలు, పెన్సిళ్లు, వంట సామగ్రి వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం చెంగయ్య, సంఘం అధ్యక్షుడు మురళి, లక్ష్మీనారాయణ, నాగరాజు,కుమార్, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం


మాట్లాడుతున్న సీడీపీఓ శోభారాణి

నాగలాపురం: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, వాటిని ఎవరైనా ప్రోత్సహించినా, పెళ్లి చేసినా వారికి రూ.లక్ష జరిమానా, మూడేళ్ల జైలుశిక్ష తప్పదని ఐసీడీఎస్ సీడీపీఓ శోభారాణి అన్నారు. పిచ్చాటూరు మండలంలోని పులికుంద్రం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ శోభారాణి ఆధ్వర్యంలో మంగళవారం బాల్య వివాహాల నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల నిరోధక చట్టం 2006 ప్రకారం అమ్మాయి వయస్సు 18 ఏళ్లు, అబ్బాయికి 21 ఏళ్లు విధిగా ఉండాలని, నిర్దేశిత వయస్సులోపు పెళ్లి చేస్తే చట్టరీత్యా నేరమని అన్నారు. మీ చుట్టు ప్రక్కల ప్రాంతాల్లో ఎవరైనా బాల్య వివాహాలు చేస్తే, వెంటనే స్థానిక పోలీసులకు, 1098 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మారియమ్మ, అంగన్‌వాడీ సిబ్బంది ఎన్.పద్మావతి, జి.శాంతి పాల్గొన్నారు.

అథ్లెటిక్ మీట్‌లో శ్రీకాళహస్తి విద్యార్థుల ప్రతిభ

శ్రీకాళహస్తి: తిరుపతిలో జరిగిన జిల్లాస్థాయి అథ్లెటిక్ మీట్‌లో శ్రీకాళహస్తికి చెందిన విద్యార్థులు ప్రతిభ చూపారు. పట్టణంలోని ఓ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న యశ్వంత్ పరుగు పందెంలో మొదటిస్థానం, షాట్‌పుట్‌లో మూడో స్థానంలో నిలిచాడు.

అలాగే అదే పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న మహేష్ పరుగు పందెంలో మొదటి స్థానం, తొమ్మిదో తరగతి చదువుతున్న చైతన్య షాట్‌పుట్‌లో ద్వితీయ స్థానం, తొమ్మిదో తరగతి విద్యార్థి జననీ షాట్‌పుట్‌లో మూడో స్థానంలో నిలిచారు. వీరిని మంగళవారం పలువురు అభినందించారు.


అథ్లెటిక్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులు

విజ్ఞానగిరి పనులు పూర్తి చేయండి


పనులను పరిశీలిస్తున్న అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: విజ్ఞానగిరి ఆధునికీకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు కోరారు. మంగళవారం ఆయన విజ్ఞానగిరిపై జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునికీకరణ పనులను ఎందుకు నిలిపివేశారని ప్రశ్నించారు. శ్రీకాళహస్తికి తలమానికంగా ఉండేలా కుమారస్వామి ఆలయాన్ని తీర్చిదిద్దాలని, వెంటనే పనులను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. తమ పాలకమండలి హయాంలో రూ.2.90 కోట్లతో ఆధునికీకరణ పనులను చేపట్టామన్నారు. అయితే ఈ పనులు ఎక్కడికక్కడ ఆగిపోయయన్నారు. ఎపుడు పూర్తిచేస్తారన్న విషయం ప్రశ్నార్థకంగా మారిందని తెలిపారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి జోక్యం చేసుకుని ఆధునికరణ పనులు పూర్తి చేయాలన్నారు.

మడుగుకాదు.. మాదనపాళెం రోడ్డు

వరదయ్యపాళెం: సత్యవేడు మండలంలోని మాదనపాళేనికి వెళ్లే రోడ్డు మడుగును తలపిస్తోంది. అధ్వానంగా ఉన్న రోడ్డులో తమ ఊరికి ప్రయాణం ఎలా సాగించాలంటూ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాళ్లకుప్పం నుంచి మాదనపాళెం గ్రామం వరకు 1.85 కిలోమీటర్ల మేరకు గతంలో పంచాయతీ రాజ్‌కు చెందిన గ్రావెల్ రోడ్డు ఉండేది. అయితే ఈ దారిలో సీసీ రోడ్డు వేసేందుకు ఈపీపీ ద్వారా గత ప్రభుత్వం రూ.1.35 కోట్లు నిధులు మంజూరు చేసింది. 925 మీటర్ల మేరకు సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయింది. మిగిలిన 925 మీటర్లు సీసీ రోడ్డు నిర్మాణం జరగాల్సి ఉంది. ఈ ప్రాంతంలో పెద్దఎత్తున గుంతలు ఏర్పడి వర్షమొస్తే ఆ గుంతల్లో నీరు నిల్వ చేరి రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ప్రధానంగా కార్లు, ద్విచక్ర వాహనాలు ఆ గుంతల్లో దిగి పాడైపోతున్నాయి. ఈ గ్రామం శ్రీసిటీ పారిశ్రామికవాడ పరిధిలో ఉండడంతో పెప్సీకో బాల్ బేవరేజెస్ తదితర పరిశ్రమలున్నాయి. ఆ ఫ్యాక్టరీలకు ఈ మార్గంలో ఉద్యోగులు, కార్మికులు వందలాది మంది ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాల్లో వెళుతుంటారు. వీరందరూ వర్షం పడితే ఆ మార్గం మీదుగా వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి ఈ రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని గ్రామస్తులు, కార్మికులు, ఉద్యోగులు కోరుతున్నారు.



గుంతలమయమైన మాదనపాళెం రోడ్డు

రాజీ మార్గమే రాజమార్గం


సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీనివాస్‌నాయక్

శ్రీకాళహస్తి: రాజీ మార్గమే రాజమార్గమని శ్రీకాళహస్తి కోర్టు జిల్లా అదనపు న్యాయమూర్తి శ్రీనివాస్‌నాయక్ అన్నారు. పట్టణంలోని న్యాయస్థానం భవనంలో మంగళవారం పలు శాఖల అధికారులతో న్యాయమూర్తి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి శ్రీనివాస్‌నాయక్ మాట్లాడుతూ రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు వచ్చేనెల 14వ తేదీన శ్రీకాళహస్తి న్యాయస్థానం ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ లోక్ అదాలత్ ద్వారా కోర్టులో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. లోక్ అదాలత్‌లో పరిష్కరించిన కేసులకు అప్పీలు లేదని తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు బేబీరాణి, కృష్ణప్రియ తదితరులు పాల్గొన్నారు.

రాజన్న ఫౌండేషన్‌కు సీఎస్‌ఆర్ టైమ్స్ గోల్డ్ అవార్డు


రాజన్న ఫౌండేషన్‌కు అవార్డు ప్రదానం చేస్తున్న గోవా సీఎం ప్రమోద్ సావంత్

రేణిగుంట: అమర రాజా కంపెనీ సౌజన్యంతో నడిచే రాజన్న ఫౌండేషన్‌కు నైపుణ్యాభివృద్ధి విభాగంలో 2024 సంవత్సరానికిగాను ప్రతిష్టాత్మకమైన సీఆర్‌ఎస్ టైమ్స్ గోల్డ్ అవార్డు దక్కింది. ఈ అవార్డు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీకి, ప్రత్యేకంగా స్కిల్ డెవలప్‌మెంట్ రంగంలో ఫౌండేషన్ అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా ప్రముఖ సీఎస్‌ఆర్ టైమ్స్ సంస్థ గోవా రాజ్‌భవన్‌లో జరిగిన 11వ నేషనల్ సీఎస్‌ఆర్ సమ్మిట్ కార్యక్రమంలో అందజేసింది. ఈ కార్యక్రమంలో గోవా రాష్ట్ర ముఖ్యమంత్రి డాక్టర్ ప్రమోద్ సావంత్, పార్లమెంటు సభ్యుడు సదానంద్ చేతుల మీదుగా రాజన్న ఫౌండేషన్ హెడ్ సతీష్ రాళ్లపల్లి అవార్డును అందుకున్నారు. నైపుణ్యాలు, జ్ఞానంతో వ్యక్తులకు సాధికారత కల్పించడంలో, మెరుగైన జీవనోపాధి అవకాశాలను పొందడంలో రాజన్న ఫౌండేషన్ చొరవకు ఈ అవార్డుని అందించినట్లు రాజన్న ఫౌండేషన్ వ్యవస్థాపకులు గల్లా రామచంద్రనాయుడు తెలిపారు.

అటవీ అధికారుల పెత్తనం ఏమిటి?

- అధికారులను అడ్డుకున్న బత్తలవల్లం వాసులు


అటవీశాఖ అధికారులతో మాట్లాడుతున్న బత్తలవల్లం గ్రామస్తులు

వరదయ్యపాళెం: ఎన్నో ఏళ్లుగా తమ ఆధీనంలో ఉన్న రెవెన్యూకు చెందిన భూముల్లో అటవీశాఖ అధికారుల పెత్తనం ఏమిటని బత్తలవల్లం గ్రామస్తులు ప్రశ్నించారు. బత్తలవల్లం సమీపంలోని ఏకం ఆలయానికి ఆనుకుని ఉన్న భూములు అటవీశాఖకు చెందినవని, ఆ భూముల్లో యూకలిప్టస్ మొక్కలు నాటడానికి వచ్చిన అటవీశాఖ అధికారులను బత్తలవల్లం గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ భూములు ఏళ్ల తరబడి తమ అనుభవంలో ఉన్నాయని, ఇళ్లు లేని వారు అనేక మంది తమ గ్రామంలో ఉన్నారని, వారి నివేశ స్థలాలకు ఉపయోగించుకునేందుకు గతంలో రెవెన్యూ వారికి విన్నవించామన్నారు. ఎలాంటి సమాచారం లేకుండా ఉన్నఫళంగా వచ్చి మొక్కలు నాటేందుకు ప్రయత్నించడం సరికాదని వారు అటవీశాఖ అధికారులను అడ్డుకున్నారు. దీంతో సమాచారం అందుకున్న సత్యవేడు ఎఫ్ఆర్ఓ జయప్రసాదరావు ఆ భూముల వద్దకు చేరుకుని అడ్డుకున్న గ్రామస్తులతో మాట్లాడారు. తమ వద్ద ఉన్న రికార్డుల ప్రకారం ఆ భూమి పూర్తిగా రిజర్వ్ ఫారెస్ట్‌కు చెందినదని చెప్పారు. రెవెన్యూకు చెందినదిగా రికార్డుల్లో ఉంటే ఆ వివరాలను తమ దృష్టికి తెస్తే సంయుక్తంగా రికార్డులను పరిశీలించి, చర్యలు తీసుకుంటామన్నారు.

డ్రగ్స్ రహిత ఇండియా పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్, అధికారులు

తిరుపతి సిటీ: ఎస్వీయూ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం డ్రగ్స్ రహిత ఇండియా పోస్టర్లను ఎస్వీయూ వీసీ డాక్టర్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ, విద్యాలయాల్లో డ్రగ్స్, మద్యం, ధూమపానం వంటి మత్తుపదార్థాల వాడకం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వర్సిటీ పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలో 'డ్రగ్స్ రహిత ఇండియా' అంశంపై ఈనెల 29న వక్తృత్వపోటీలు, 30న క్విజ్, 31న ర్యాలీ నిర్వహించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో డీన్ ప్రొఫెసర్ చంద్రాయుడు, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్లు దామోదరం, డాక్టర్ హరికృష్ణ, పలు కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

రేషన్‌షాపు తరలిస్తే ఆందోళన తప్పదు



నిరసన తెలుపుతున్న ఎంజీనగర్ వాసులు

వరదయ్యపాళెం: తమ గ్రామంలో ఏళ్లతరబడి ఉన్న రేషన్‌షాపును మరో గ్రామానికి తరలిస్తే ఆందోళన తప్పదని ఎంజీనగర్ గ్రామస్తులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మంగళవారం వరదయ్యపాళెం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎంజీనగర్ గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. సంవత్సరాల తరబడి గ్రామస్తులకు అందుబాటులో ఎంజీనగర్‌లో కొనసాగుతున్న రేషన్ దుకాణాన్ని ప్రస్తుత కూటమి నేతల అత్యుత్సాహంతో సుదూర ప్రాంతంలోని అంబికాపురం గ్రామానికి తరలించేందుకు కుట్రలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ గ్రామం నుంచి అంబికాపురం గ్రామానికి 4 కిలోమీటర్ల దూరం ఉందని, అక్కడకు వెళ్లేందుకు కనీసం బస్సు సౌకర్యం కూడా లేదని, అలాంటి పరిస్థితుల్లో నెలసరి సరుకులు తాము ఎలా తెచ్చుకోవాలని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో ఇళ్ల వద్దకే వచ్చి రేషన్ సరుకులు అందజేసే వారని, ప్రస్తుతం ఆ వాహనం కూడా ఆగిపోయిందన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. రేషన్ దుకాణం మార్పు నిర్ణయం తమ దృష్టిలో లేదని, అలాంటి నిర్ణయం తీసుకుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు.